# తీరని కోరిక

నా పసుపూ కుంకుమా చల్లగా వుండి, ఆయన గారుండగానే, నేనిల్లాగే కళ్ళు మూస్తే అంతే చాలు, ఆడ దానికంతకంటే అదృష్టం యింకేవి కావాలే......అనేది మా అమ్మమ్మ.

అదే ఆవిడ ఆఖరి కోరిక. ఆ కోరిక ప్రకారమే కాలం వెళ్ళమార్చుకుని వెళ్ళిపోయిందావిడ. మా అమ్మమ్మ నిజం గానే అదృష్టవంతురాలు.

అంటే—

మా తాతయ్య బ్రతికుండగానే చనిపోయింది కాబట్టని కాదు. మా అమ్మమ్మ మనసారా నమ్మి, నోరారా చెప్పిన కోరిక అదొక్కటే కాబట్టి. ఆ కోరిక నెరవేర్చుకుని మరీ కాలధర్మం చేసింది కాబట్టి.

కాలధర్మం అంటే గుర్తుకొచ్చింది. ఏ కాలాని కా కాలానికొక ధర్మం ఉంటుంది. ఒక కాలానికధర్మమైంది ఇంకో కాలానికి ధర్మం కావచ్చుగదా. అందుకనేనేమో, నా కోరికల్ని తలచుకున్నప్పుడల్లా మా అమ్మమ్మ గుర్తొస్తుంది కోరికలులేని కాలమంటూ కాలం వొకటుంది. ఆ కాలం యీ మామూలు కాలాల్లాంటిది కాకపోవచ్చుగాక. అది కాలమే కాదని కొందరంటే అంటారుగాక.

కోరికల్ని జయించడం మంచిదని అన్నవాళ్ళున్నారు.

కోరికలు శత్రువులనుకుని రుణ శేషమూ, శత్రు శేషమూ వుంచరాదని అన్నవాళ్ళు వాళ్ళు.

కాని ఇక్కడే వున్నదొక కిటుకు. శత్రు శేషం వుంచని వీరులు చాలమందున్నారు. ఆ చాలమంది చరిత్రలో తాత్కాలికంగా ఒక పుటనో, అధ్యాయాన్నో ఆక్రమించుకుని నిష్క్రమించారు. ఐతే అజాత శత్రువులున్నారే, ఆ అజాత శత్రువులు ఆచంద్రతారార్కం నిలబడినా నిలబడకపోయినా, నిలబడే అవకాశం వున్నదని అప్పుడప్పుడూ మన కనిపిస్తుందే. వుంటూనే వున్నట్టు మనకనిపిస్తూనే వుందే.

ఇందులో ఎవరు గొప్ప?—శత్రు శేషం వుండని వీరులా. అజాత శత్రులా......కోరికలు జయించినవారా? కోరికలే లేనివారా?

ఈ ప్రశ్నలు నేను పుట్టి బుద్ధెరిగిన తర్వాత చాలా సార్లు వేసుకున్నాను. సమాధానం తేలిగ్గా చేతికి చిక్కలేదు. నేను చిక్కులో పడ్డాను. చిక్కులో చిక్కుకున్న చిక్కులో పడి ఉక్కిరిబిక్కిరై పోయాను. చిక్కిపోయాను, శారీరకంగా కాదు, ఆ చిక్కుల్లో.

అడిగేవారికి చెప్పేవారు లోకువని మనందరం ఒప్పుకుంటాం. ఆ గొప్పదనం అడిగేవాడిలో లేదు, వాడడిగే ప్రశ్నలో వుంది. ఆ మాటకొస్తే, వాడడిగే ప్రశ్నలోనేకాదు, ప్రతి ప్రశ్నలోనూ వుంది.

అందుకనే ఈ ప్రపంచం ఒక పెద్ద ప్రశ్నార్థకం...... అంటే బహు గొప్పదన్నమాట.

ఎంత గొప్పది కాకపోతే, ఏ కోరికలూ లేని కాలం లోంచి, కోరికలెన్నో వున్న కాలంలోకి దొర్లుకొస్తుంది? ఇది పురోగమనమా? తిరోగమనమా? ఏ గమనమైనా గమనం మాత్రం ఔను కదా.

ఈ గమనంలో మనం వున్నాంగదా. అదీ అసలు విషయం. నేను వున్నాను. మీరున్నారు...మనం వున్నాం. వున్నాం కనకనే నేననేవన్నీ మీ రనకపోయినా వింటు న్నారు. మీరు వినాలనే నా కోరిక.

నా కోరిక లన్నింటిలాగే, యీ కోరికా కరిమింగిన వెలగపండైతే ... అని నా సందేహం. ఎందుకంటే నాకు సందేహాలెక్కువ. ఆ సందేహాల్లోంచే కోరికలు పుట్టుకొచ్చినై నాకు.

ఆ మాటే ఒకసారి నేను మావారితో అన్నాను. వారేమన్నారో తెలుసా? దేహం వున్నంతకాలం యీ సందేహాలు తప్పవన్నారు. ఐతే, కోరికలూ తప్పవు గదా అన్నాను.

కోరికలంటే నువ్వనుకునేదాన్నిబట్టి వుంటుంది ... అన్నారు వారు.

కోరికల్లో గూడా తెగలూ, తరగతులూ వున్నవా అన్న సందేహం అప్పటిగ్గాని కలగలేదు నాకు. కోరికలలో తెగలూ తరగతులూ తప్పించుకోలేనివాళ్ళం తరగతులూ, తెగలూ లేని సమాజాన్నెలా సృష్టించుకోగలమా? అన్న సందేహం కలిగింది.

(21)

పోనీ,

తెగలూ తరగతులూ లేని సమాజాన్ని సృష్టించుకున్ననాడు, కోరికల్లో తెగలూ, తరగతులూ లేకుండానైనా పోతాయా అని ఇంకో సందేహం వచ్చింది.

నాకింకే కోరికా లేదు, ఈ ఒక్క సందేహం తీర్చండి అని అడిగాను మావారిని.

చచ్చాం......అన్నారాయన. అంటూనే పగలబడి నవ్వారు.

ఛావులో అంత ఆనందం వుంటుంది కానన్ను... అనుకున్నాన్నేను, అమాయకంగానే. అప్పుడుగాని మా అమ్మమ్మ అమాయకత్వం నాకర్థం కాలేదు.

మా అమ్మమ్మ కోరుకున్నదీ అంతే. చావులో సుఖాన్ని.

ఎంత స్వార్థం.

అప్పటికి మాఅమ్మమ్మింకా చనిపోలేదు. అమ్మమ్మా, అమ్మమ్మా, తాతయ్యకంటే ముందు నువ్వు చనిపోతే, తాతయ్య కిబ్బందికాదూ? అనడిగేశాను. అడిగేశానే గాని అనగానే నాలిక్కొరుచుకున్నాను.

చావుకంటే బ్రతుకు గొప్పదనే అయ్యుండాలి మా అమ్మమ్మ ఉద్దేశం. ఆ గొప్పదనం మా తాతయ్యకు దక్కాలనే అయ్యుండాలి ఆవిడ కోరిక. అంత గొప్ప బ్రతుకును తాతయ్య కప్పగించి నిస్వార్థంగా తాను కళ్ళు మూసుకోవ

డమే, తాతయ్యంటే తనకున్న ప్రేమకు తార్కాణం అనుకునుండాలి మా అమ్మమ్మ...

కాబట్టి అమ్మమ్మ చచ్చిపోయి సుఖపడదామని కాదు అనుకుంది, బ్రతుకులో వున్న సుఖాన్ని కాదనుకోవడమే గొప్ప అనుకుంది. తాతయ్యకంటే ఎక్కువకాలం బ్రతికి, తాతయ్యంటే వున్న బంధాన్ని తెంచుకోలేక బాధపడేకంటే తనకు తెలియకుండా ఆ బంధం తెగిపోతేనే మంచిదనుకుంది.

ఇదింకా గమ్మత్తుగా వుందనిపించింది.

ఐతే, అమ్మమ్మ వద్దనుకున్నది బ్రదుకులో వున్న సుఖాన్నీ కాదు, తీయదనాన్నీ కాదు. తాతయ్యకంటే ఎక్కువ కాలం బ్రతికితే, బ్రతుకులో రుచి చూడవలసివచ్చేదని.

ఇదంతా ఆలోచించుకుంటూ కూర్చుంటే ఎంతో ఆశ్చర్యం వేసింది. ఆ ఆశ్చర్యాన్నదుముకోలేక, అమ్మమ్మ మొహం తేరిపారజూశాన్నేను.

అదేవిఁటే, నా ముహంవంక అదేపనిగా అట్లా చూస్తావ్. నా మొహాన్నేవైఁనా కోతులాడుతున్నయ్యా? అంది అమ్మమ్మ. అని నవ్వేసింది.

అడిగితే మావారు నవ్వారు.

అడిగి నాలిక్కరచుకుని, ఆలోచించుకుంటూంటే మా అమ్మమ్మ నవ్వింది.

ఐనా, నాకు నవ్వు రాలేదు.

మా అమ్మమ్మ అన్న కోతులు గుర్తుకొచ్చినై.

కోతులకూడా కోరికలుంటాయా?

అన్నట్టు మానవజాతికీ వానర జాతికీ మూలజాతి ఒక్కటే అని కదూ అంటారు శాస్త్రవేత్తలు.

వానరుల్లో మానవత్వం ఎక్కువా?

నరుల్లో వానరత్వం ఎక్కువా?

మనలో కోరికలు ఆ వానరత్వానికి చిహ్నమా?

మానవత్వానికి చిహ్నమా?

ఈ ప్రశ్న నేను కాలేజీలో చదువుకునేప్పుడొక లెక్చరర్ గారి నడిగాను.

రెంటికినీ..అని నవ్వేశారాయన.

క్లాసంతా పగలబడి నవ్వారు, చిన్నప్పుడు నేను చింపిరి తలతో బడికెళ్ళినప్పుడు చూచి నవ్విన పిల్లల్లాగా.

నాకు నవ్వు రాలేదు కాని సిగ్గేసింది.

ఆనాటి సిగ్గు యీనాటికి వదల్లేదు నన్ను.

స్త్రీకి సిగ్గు పెట్టని ఆభరణంలాంటిదని అంటారు కదా అని సరిపుచ్చుకున్నాను గాని, ఆనాడు వేసిన ప్రశ్నకీనాటికీ సమాధానం దొరకలేదు నాకు.

దొరకదుగదా అని వూరుకోలేదు నేను. మా అమ్మమ్మ నడిగాను.

చదవేస్తే వున్న మతి గూడా పోయిందనీ......ఏం మాటలే అవి? అని కూర్చున్న చోటునుంచి చివాలున లేచెళ్లి పోయింది.

నిజమేననిపించింది నాకు. చదువుకోకుండా వుంటేనే పోయేదేమోననిపించింది, నిజం చెప్పొద్దూ?

ఈ నిజం చెప్పాలన్న మాట గూడా నాకా చదువే నేర్పింది. అందుకనేనేమో, నిజానికివి రోజులు కావనేవాళ్లు చదువుకంటే బ్రతుకు గొప్పదని అంటారు. చదువు చెప్పలేని అనుభవం జీవితం చెప్తుందంటారు. నిజానికి చదువుకూ బ్రతుక్కూ అంత దూరం వుందా ?

బ్రతుక్కు సమన్వయం చదువు నేర్పుతుందా? చదువుకు దండాన్వయం బ్రతుకు నేర్పుతుందా?

వారిజాక్షులందు, వైవాహికములందు, ప్రాణ విత్త మానభంగమందు...బొంకవచ్చు నధిప...అన్నాడు బ్రతుకును కాచి వడపోసిన గురువు బలిచక్రవర్తితో. కాని అదీ మనం చదువుకున్నదేనే.

ఈ సందేహానికి సమాధానం మావారు చెప్పారు.

పిచ్చిదద్దమ్మా, చదువంటే గతం; బ్రతుకంటే పుస్తక ప్రస్తుతం...అన్నారు.

ప్రస్తుతాన్ని మనం చదువుకోలేమా? అనడిగాన్నేను.

నువ్వు చేస్తున్న పనదేగా...అన్నారు వారు.

అదేమంటే, కోరికల్లోలాగానే, చదువుల్లోనూ తెగలూ తరగతులూ వున్నాయన్నారు. అని వూరుకుంటే బాగానే వుండేది, మళ్ళీ నవ్వారు.

ఇక వుండబట్టలేక, నవ్వీన నాపచేనే పండుతుందిలే... అన్నాను.

అది నువ్వు చదువుకునన్నమాట కాదు...అన్నారు.

ఔను. చదువుకున్నదే. అమ్మమ్మ చెప్పిన చదువు... అన్నాను.

అర్థంకాని చదువది అన్నారు.

నాకోపం వచ్చింది, అమ్మమ్మ నర్థంచేసుకోలేనిదాన్నా నేనని. కాని, వెంటనే తమాయించుకున్నాను; మావారు ద్వంద్వార్థంగా మాట్లాడ్తారని తెలిసిందాన్నికాబట్టి, మాట్లాడారేమోనని సందేహించాను.

ఆ చదువుతో డబ్బు చేసుకోలేమేమోగాని, బ్రతుకు బాగుచేసుకోగలం అన్నాన్నేను. నా తెలివికి నేనే సంతోషిస్తూ.

అదేమిటి? అన్నారు వారు.

అర్థంకాని చదువంటే మీ ఉద్దేశం అదేగా...అన్నాన్నేను, యీసారి తప్పించుకోండి చూద్దాం అంటూన్నట్టర్థం కాకుండా.

ఐతే అర్థంలేని చదువు అన్నారు వారు, యీసారమాయకంగా.

అన్నా అదే అర్థం అన్నాన్నేను వెనుకంజ వెయ్యకుండా.

ఐతే, నాపచేనంటే అర్థం ఏఁవిఁటో చెప్పూ అన్నారు వారు.

అది ప్రశ్న కాదు. ఆ ప్రశ్నలోనే నువ్వు చెప్పలేవన్న అర్థం స్ఫురించింది.

ఆ అర్థాన్ని పట్టించుకోనట్టు నటించాన్నేను. అర్థానికున్న అసలు అర్థం పోయి డబ్బు అన్న అర్థం ఎప్పట్నుంచొచ్చిందీ? ఎందుకొచ్చిందీ? అని ఆలోచనలో పడ్డాను.

నాపచేనుకూ, నాపసానికీ అర్థసామ్యం వున్నదా అన్న ఆలోచనలో పడ్డాను.

మనిషికి లోచనాలు ముఖ్యమా, ఆలోచనలు ముఖ్యమా అన్న ఆలోచనలో పడ్డాను.

నా ఆలోచన మావారికి మగత నిద్రలా కనుపించింది. ఆయన గాఢనిద్ర పోయారు.

ఇక నా జీవితం ఇంతేనా? అర్థం పర్థం లేని ఆలోచనల్తో అర్థరాత్రివరకూ నిద్రపోకుండా వుండడమేనా?

లేచి కాగితంమీద పెడితే, మూగభావాలకి నోరు వస్తుందేమో అనుకున్నాను. ఉక్కిరిబిక్కిరి బొమ్మలకొక రూపం దొరుకుతుందేమో, ఏర్పడుతుందేమో అనుకున్నాను.

కొందరికి కాగితంమీద కలం పెడితే, భావాలు సెలయేటిలా స్వచ్ఛంగా పరుగెత్తుతాయని విన్నాను.

కొందరు తమకే తెలియని ఆలోచనలు, తమకే విభ్రాంతి కలిగించేట్టు ఆశువుగా అనర్గళంగా మాట్లాడెయ్య గలరని విన్నాను.

నాకా రెండు శక్తులూ వున్నట్టులేవు. మనసెంత మస కగా వుంటుందో మాటలంత మోసం చేస్తాయని ఇప్పటిగ్గాని తెలిసిరాలేదు నాకు.

ఇప్పుడే గాదు; ఎప్పుడూ ఇంతే.

నాకు బాగా జ్ఞాపకం; మా అమ్మమ్మ నన్ను గడ్డం పుచ్చుకు బ్రతిమాలింది...చిన్నమాఁవఁయ్యని చేసుకోవే... అని.

ఏం చేసుకోను? అనడిగాన్నేను.

మా అమ్మమ్మ చేసుకోమనేది పెళ్ళి అని నాకు తెలుసు. ఐనా అడిగాను. అప్పటిని నేను మావారిని కలుసుకోలేదు. అన్నట్టు మావారు మా చిన్న మాఁవఁయ్య కాదు. కాలేజీలో నాతో పాటు చదువుకున్నవారు. మా అమ్మమ్మ నన్ను బ్రతిమాలేప్పటికి నేనింకా కాలేజీలో చేరలేదు.

ఊరుకోమ్మా...దానికింకా చదువుకోవాలనుందేవోఁ ...అన్నాడు మా చిన మాఁవఁయ్యప్పుడు. మా చిన మాఁవఁయ్య చాలా మంచివాడు. నేను కాలేజీలో చేరగానే పెళ్ళిచేసేసుకున్నాడు వూళ్లో చదువుకోని ఇంకో అమ్మాయిని.

ఏం చేసుకోను? అన్నదానికి సమాధానం అంత తేలిగ్గా దొరుకుతుందని అప్పటిగ్గాని తెలిసిరాలేదు నాకు.

తర్వాత చెప్పానుగదూ మావారిని, కాలేజీలో కలుసుకున్నానని, అదింకా గమ్మత్తు.

నేను ప్రశ్నడిగితే క్లాసంతా పగలబడి నవ్వేందన్నానే, అప్పుడా క్లాసులో మావారూ వున్నారు. అప్పటికింకా మా పెళ్ళి కాలేదు. ఆవేళ క్లాసొదలగానే, నేను వరండాలోంచి వెళ్తూంటే వెనకాలే వచ్చి...ఇందాక నేన్నవ్వలేదు... అన్నారు.

ఏం? అందావఁనుకున్నాను. బావుండదని ఏవిఁటీ? అన్నాను.

ఏమీలేదు, నేనూ అందరితోపాటే అనుకున్నారేఁవోఁననీ...అన్నారు నీళ్లు నములుతూ...

నేననుకోలేదు...అన్నాను.

నిజం? అన్నారాయన ఎగిరి గంతేసినంత పని చేసి.

అబద్ధం కాదు అన్నాన్నేను.

ఐతే మీరూ నన్ను ప్రేమిస్తున్నారన్నమాట... అన్నారాయన ఎగిరి తన చెవుల్ని తానే నమ్మలేకపోతూన్నట్టూ. నాకూ్కడా ఆ మాటలు వినబడీ వినబడనట్టూ.

ప్రేమంటే ఏవిఁటీ? అన్నాను నేను. ప్రేమమీాదకంటె ఏఁవిఁటీమీాద యెక్కువ మోజున్నట్టు.

ఆయనేఁవఁనుకున్నారో, ఏఁవో, నేనందరిలాంటివాణ్ణి కాదు; మనం పెళ్ళిచేసుకుందాం...అన్నారు.

నాకాశ్చర్యం వేసింది.

ఏం చేసుకోను ? అంటే కాబోయే పెళ్ళి ఆగిపోయింది.

ప్రేమంటే ఏఁవిఁటీ? అనగానే ఒక పెళ్ళి పాదాల ముందుకొచ్చి నిలబడింది.

మంచిదే...అని లోపలనుకోవలసిన మాట పైకనే శాను. ఆ మాట ప్రకారం పెళ్లి ఐపోయింది.

ఇంకేఁ? అంతా బాగానే వుందనుకున్నాను. ఇక లక్షణంగా కాపురం చేసుకుంటూ, పిల్లల్నికంటూ బ్రతకొచ్చు గదా మా అమ్మమ్మలాగా అనుకున్నాను.

కాని, మా అమ్మమ్మంత అదృష్టవంతురాల్ని కాదు నేను. మా అమ్మమ్మకింకేఁవిఁ కోరికలుండేవో నాకు తెలియదు కాని, వాటన్నింటికంటే పెద్దకోరిక, చివరి కోరిక, తీరిన కోరిక నేను చెప్పిందేనని మాత్రం నాకు గట్టిగా తెలుసు.

నేను అలా కోరుకోగలిగితే ఎంత బావుండును అనుకున్నాను. కోరుకున్నాను. ఆ కోరిక నెరవేరుతుందో లేదో నాకు తెలియదు. కాని ఆ కోరికకంటే బలవత్తరమైన కోరిక ఇంకొకటి కలుగుతోంది.

ఆ కోరిక కోరుకోవడం ఎందుకో తెలుసుకోవాలన్న కోరిక.

ఆ కోరిక ఏమిటో? ఎప్పుడు కలిగిందో? ఎలా కలి

గిందో?...ఇంకా ఇలాంటి లక్ష ప్రశ్నలెన్ని వేసినా మీకు నేను సమాధానం చెప్పగలను.

కాని, ఎందుకు? అన్న ప్రశ్నకు ఇంతవరకు నాకు జవాబు దొరక లేదు.

గాఢ నిద్ర పోతూన్న మా దొరగార్ని గూడా లేపి, అడిగాను.

కసురుకోకుండా, విసుక్కోకుండా నే చెప్పిందంతా సావధానంగా విన్నారు. విని, అర్థరాత్రి యీ మద్దెలదరు వేమిటీ...అన్నారు నవ్వుతూ.

నా కోరిక మద్దెలదరువా? ఐతే మీతో నేనిక మాట్లాడను...అని మునగదీసుకున్నా న్నేను.

కాదు......ఇది అర్థరాత్రి......ఈ ప్రశ్న వేసింది నువ్వొక్కదానివే కాదు...అని బుజ్జగించబోయారు.

ఇంకా యీ గదిలో యెవరున్నారు, మీరూ నేనూ తప్ప? అన్నా న్నేను.

నేనున్నాను గదా అన్నారాయన, నావంక చిలిపిగా చూస్తూ.

అంతలోనే మళ్ళీ గొంతు మార్చి, చిన్నపిల్లల్ని కోప్పడినట్టు, నీ మొహానే పొద్దుపొడవ లేమ లే. రేప్పొద్దున్న తూర్పునా పొడుస్తుంది. ఈ లోగా కాస్సేపు కళ్ళు మూసుకుని నిద్రపో...అని కోప్పడ్డారు.

నా పెళ్ళయిం తర్వాత, వారిలా కోప్పడగలరని నాకు తెలిసివచ్చిందివ్వాళే.

అలాగే నా చివరి కోరికా నెరవేరుతుందేమో, ఎందుకూ? అన్న ప్రశ్నకు సమాధానం దొరుకుతుందేమోనని అలాగే చీకట్లో కళ్ళు తెరుచుకుని పడుకున్నాను.

ఇప్పటికీ అలాగే వున్నాను.

ఎప్పటికి నెరవేరుతుందో తెలియదు.

— /o/ —